ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

నాంపల్లి: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. అనంతరం మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వండిన ఒడిబియ్యం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన ప్రసంగించారు. ప్రాచీనమైన ఆలయాన్ని దర్శించుకునే భాగ్యం దక్కడం పూర్వజన్మ సుకృతం అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుశీల్, ఉపాధ్యక్షుడు కరణ్‌సింగ్, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సురేష్, కోశాధికారి సాయి, ప్రధాన అర్చకులు నర్సింహాచారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలి



జియాగూడ: రాబోయే జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్ ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని బీజేపీ హర్ ఘర్ తిరంగా నియోజకవర్గం కన్వీనర్ శివకుమార్‌యాదవ్ అన్నారు. జియాగూడలో కేశవ స్వామి మందిరంలో జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని అయన హాజరై మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమం విజయవంతం చేస్తున్నామన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో స్థానికుడికి అవకాశం ఇచ్చి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు దర్పల్లి నర్సింహులు, మాజీ అధ్యక్షులు జె.లక్ష్మీనారాయణ, రమేష్ చౌగ్లె, ముచ్చింతల సత్యనారాయణ, పి.శంకర్‌రావు, గుర్రం శివ శంకర్, సందీప్, రాజ్‌పోల్, సంతోష్, కిషన్‌దామ, తులసిదాస్, కె.శివాజీ పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల శోభాయాత్ర



శివపార్వతుల విగ్రహాలతో మహిళలు

గోల్కొండ: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని కార్వాన్ జాంగ్ర సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. జాంగ్ర సంఘం అధ్యక్షుడు అనూప్ బుగుడి ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభాయాత్రలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ చేతుల్లో శివపార్వతుల విగ్రహాలను పట్టుకొని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ వారు ప్రత్యేక వేదిక వేసి శోభాయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్యామలింగం, దేవర చంద్రశేఖర్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ సిటీజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 19న గ్లోబల్ ఐకాన్ యూత్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా మంత్రి గడ్డం వివేక్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బండప్రకాష్ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాలు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా శ్రావణమాసం పూజలు



అఫ్జల్‌గంజ్: పలు శివాలయాల్లో శ్రావణమాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల సందడి పెద్ద ఎత్తున పెరిగింది. అఫ్జల్‌గంజ్, ధూల్‌పేట్, పురానాపూల్ ప్రాంతాల్లోని శివాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే అభిషేకం, అర్చనలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కాశీబుగ్గ టెంపుల్ సేవా సమితి నిర్వాహకులు ఓంసింగ్, అనిల్, విజయ్ సేవక్‌ల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు.



దాదాపు మూసుకుపోయిన షేక్‌పేట్ గేలాక్సీ నాలా



పైపులు లేని మురుగు నీటి నాలా

నిర్లక్ష్యానికి నిదర్శనం

- అధికారుల నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్న నాలాలు
- ప్రమాదకరంగా పైకప్పులు లేని నాలాలు
- షేక్‌పేట్ డివిజన్‌లో రోడ్లపైనే నాలా పైపులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో నాలాలు, డ్రైనేజీల నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాలాల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలాలకు పైపులైన్‌లు వేయడం, పైకప్పులు వేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు అమలుకు నోచుకోవడం లేదు. షేక్‌పేట్ గెలాక్సీ రోడ్డు, సమతాకాలనీ, సూర్యనగర్ కాలనీలతో పాటు డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీలకు మరమ్మతులు లేక మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో మోరీలు పొంగిపొర్లుతూ మురుగు నీరు రోడ్లపైకి వచ్చి నిలుస్తుంది.

రోడ్లపై పారుతున్న మురుగు..

సత్యకాలనీ, ఏజీఎస్ కాలనీ, సమతాకాలనీ, సూర్యనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కనీసం వర్షాకాలంలో డ్రైనేజీల పూడికతీత పనులు కూడా అధికారులు చేయించడం లేదు. ఇళ్ల ముందు పారుతున్న మురుగు నీటి కారణంగా ఒక వైపు దుర్గంధం, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు వేయడానికి పలుచోట్ల పైపులైన్‌లు వేసిన కూడా రోడ్డు పక్కనే పడి ఉన్నాయి. నెలలు గడుస్తున్నా పైపులు అలాగే పడి ఉండడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రశ్నార్థకంగా నాలాల ఉనికి..

షేక్‌పేట్‌లోని పురాతనమైన కొన్ని నాలాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. షేక్‌పేట్ గెలాక్సీ నాలా, బుల్కాపూర్ నాలాల నిర్వహణ నానాటికి అధ్వానంగా తయారవుతుంది. గేలాక్సీ సెంటర్ నుంచి నదీమ్ కాలనీ శాతంచెరువు వరకు ప్రవహించే నాలా ఓ వైపు కబ్జా కోరల్లో చిక్కుకోగా మరో వైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనుమరుగైయ్యే దశకు చేరుకుంది.

నాలాలో వ్యర్థాలు డంపింగ్..

టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డు దాటుకుంటూ ఈ నాలా గోల్కొండ నయాకీలాను ఆనుకొని ఉన్న శాతం చెరువులోకి వెళ్తుంది. పలువురు తమ ఇంటి ముందు నుంచి వెళ్తున్న నాలాను కుదించి దానిపై స్లాబ్‌లు వేసుకోని కబ్జాలు చేసుకున్నారు. మరోవైపు నాలాకు మెయిన్ రోడ్డు వద్ద పైకప్పు వేసిన అధికారులు అదే ప్రాంతంలో నాలాలో వ్యర్థాలు డంపింగ్ జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యర్థాల డంపింగ్ కారణంగా నాలాలో మురుగు నీరు, వరద నీరు ముందుకు కదలడం లేదు. నాలా మరమ్మతుల కోసం అధికారులు చిత్తశుద్ధి కనబరడచం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే నాలాలు కనుమరుగు కావడం ఖాయమని పలువురు అంటున్నారు.

పూడికతీతలు చేపట్టడం లేదు..



అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాకాలంలో నాలాలు, డ్రైనేజీలను పరిశీలించడం లేదు. నాలాలో వ్యర్థాలు డంపింగ్ అవుతున్నా పూడికతీతలు చేపట్టడం లేదు. అధికారులు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే నాలాలు కనుమరుగై మురుగు నీరు రోడ్లపై ప్రవహించే ప్రమాదం ఉంది.

– సత్యనారాయణ, షేక్‌పేట్

రేపు రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ్ 3కే రన్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, మధుయాష్కీగౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువత డ్రగ్స్ వైపు మళ్లకుండా క్రీడలవైపు మళ్లేవిధంగా ప్రణాళికతో ముందుకుపోతున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న 3కే రన్ వాల్‌పోస్టర్, టీషర్ట్‌లను సోమవారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 20న కొత్తపేట చౌరస్తా నుంచి సరూర్‌నగర్ స్టేడియం వరకు రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ్ పేరిట 3కే రన్ నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షులు దొంతి వినోద్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, లింగాల కిశోర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత డాక్టర్ జనువాడ రామస్వామి రచించిన 'వడియాలు' పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..మనం తినే ఆహార పదార్థాలపై చక్కటి పద్య కవిత సాహితీ సంపుటిని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఐఎస్‌ఎఫ్ అధికారి బి.ప్రభాకర్, టీటీడీ పూర్వ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీకాంతం, కవి విహారి, సీనియర్ వైద్య నిపుణులు వి.మార్కండేయులు, సాహితీవేత్త సుధామ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుపాదుల జయంత్యుత్సవాలు



భక్తులతో నిండిపోయిన అబిడ్స్ ఇస్కాన్ ఆలయం

అబిడ్స్: అబిడ్స్ ఇస్కాన్ ఆలయంలో సంస్థాపకచార్యులు, వ్యవస్థాపకులు వేదాంతస్వామి శ్రీల ప్రభుపాదు 129వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, అర్చన, విశేష పూజలు, కీర్తనలు, హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్న ఈ వేడుకల్లో చప్పన్‌బోగ్ (56) రకాల వంటకాలతో స్వామివారికి నివేదన చేశారు. మధ్యాహ్నం వరకు భక్తులు ఉపవాసంతో ఉండి ఈ ఉత్సవాలు చేపట్టారు. హైదరాబాద్ టెంపుల్ మేనేజింగ్ కమిటీ ప్రతినిధులు వరద కృష్ణదాస్, రాదేశ్యామ్‌దాస్, సీతారామ్‌దాస్‌లు పాల్గొని ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుపాదుల శిష్యులు గురుదాసు ప్రభు, అతుల్ కృష్ణ ప్రభులు స్వామివారి జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఇస్కాన్ ఆలయం సెక్రెటరి, జనరల్ మేనేజర్ శంభు వైష్ణవదాస్ పాల్గొన్నారు.

మహా అన్నదానం

జియాగూడ: పురానాపూల్‌లో గౌండ్ల మఠం సురాభాండేశ్వరా ఆలయంలో ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ఆలయంలో నెల రోజుల పాటు పూజలు నిర్వహించి ఆఖరి సోమవారం రోజు మహా అన్నదానం నిర్వహిస్తున్నమని గౌండ్ల మఠం అధ్యక్షుడు గొడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం కౌండిన్య హాల్‌లో మహా భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. భాస్కర్‌గౌడ్, వెంకటేష్ గౌడ్, యగ్నేశ్వర్ గౌడ్, నిర్మల మనుజేందర్ గౌడ్, రవీందర్ సింగ్, శివకుమార్‌గౌడ్, నాగేందర్ గౌడ్, వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నరేష్‌గౌడ్, నవీన్‌కుమార్ గౌడ్ తదితరులు

సి.వి.వి.ప్రసాద్‌కు సత్కారం



నాంపల్లి: మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం శాఖాధిపతి సి.వి.వి.ప్రసాద్ ద్రవిడియన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డిగ్రీ సాధించారు. బాసర ట్రిపుల్ ఐటీ ఉపాధ్యక్షుడు ఎ.గోవర్ధన్ మార్గదర్శకత్వంలో 'స్పేషియల్ డాటా మైనింగ్' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. ద్రవిడియన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన సి.వి.వి.ప్రసాద్‌కు సోమవారం మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మీయ అభినందన సత్కారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో పలువురు శాఖాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సత్కరించారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శశికళ, హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రైమరీ స్కూల్ కో ఆర్డినేటర్ కె.వర్షాహన, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాతిమానగర్, ఫారూఖ్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. ఫాతిమానగర్, ఫారూఖ్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే జంగమ్మెట్ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మాడభూషి శ్రీధర్‌కు దేవులపల్లి రామానుజరావు పురస్కారం

సుల్తాన్‌బజార్: డాక్టర్ దేవులపల్లి రామానుజరావు స్మృత్యర్థం నెలకొల్పిన సాహితీ పురస్కారాన్ని ఈ సంవత్సరం డాక్టర్ మాడభూషి శ్రీధర్‌కు ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్ణయించింది. ఈ నెల 25న పరిషత్తులో దేవులపల్లి రామానుజరావు 108వ జయంతి సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో పురస్కారం అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు

డబీర్‌పురా: కోమటివాడిలోని శ్రీరామ మందిర్‌లో సోమవారం ఈశ్వరునికి పంచామృత సహిత రుద్రాభిషేకం, అన్నాభిషేకం, ఈశ్వరునికి అన్నంతో అలంకరణ, రాత్రి 7 గంటలకు షోడశోచార పూజ, మంగళ హారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను బొంగులూరి రాంమూర్తి శాస్త్రి, శ్రీను పంతులు, విశ్వం పతులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

బాలుడి అదృశ్యం



మహ్మద్ కరీం

డబీర్‌పురా: బాలుడు అదృశ్యమైన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..యాకుత్‌పురా మౌలాకా చిల్లా ఆమన్‌నగర్-ఏ ప్రాంతానికి చెందిన జాకీర్ కుమారుడు మహ్మద్ కరీం (16) ఈ నెల 10న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి జాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ సర్కిల్-6లోని ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన నిర్మాణ పనులపై ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణి ద్వారా మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏఎంసీ రాజా రావు, ఎలక్ట్రికల్ ఈఈ సతీష్‌రెడ్డి, మలేరియా విభాగం ఎస్ఈ నామాల శ్రీనివాస్, యూబీడీ మేనేజర్ రఘునాథ్ రెడ్డి, ఎల్ఆర్ఎస్ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ యాసీన్, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



చార్మినార్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్: పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం చార్మినార్, ఫలక్‌నుమా సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. చార్మినార్ కట్టడం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఫలక్‌నుమా సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, ఏఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి భాయి, ఈఈ హరి కిషోర్, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణరెడ్డి, యూబీడీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



గోల్కొండ: అర్హులైన నిరుపేదలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి సంక్షేమ పథకానికి కొన్ని నిర్దిష్ట పరిమితులు ఉన్నాయని వాటిని బాగా చదివి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ సునీల్, అనంతకృష్ణ

జియాగూడ: ఆలయాల భద్రత నిమిత్తం బస్తీవాసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ అన్నారు. సోమవారం కార్వాన్‌లోని విఠల్‌నాథ్ మహాదేవ్ మందిర్, సంతోషిమాత, నల్లపోచమ్మ ఆలయాలలో పడాల అనంతకృష్ణ రూ.25 వేల ఆర్థిక సహాయం చేసి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ సునీల్ ప్రారంభించి పడాల అనంత కృష్ణ, పడాల దత్తత్రేయను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.నర్సింహులు, బస్తీవాసులు కేశవ రావు, నాగేందర్, నల్ల నర్సింగ్, రఘు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పించిన గౌండ్ల మఠం ధర్మకర్తల పాలక మండలి ప్రతినిధులు



గుడిమల్కాపూర్‌లో..

జియాగూడ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు చిరస్మరణీయమని గౌండ్ల మఠం సురాబాండేశ్వరా ఆలయ ధర్మకర్తల పాలక మండలి, పూలెకోన గీతా పరిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గొడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని పురానాపూల్ కౌడిన్య హాల్ వద్ద గల పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠంగౌడ్, బుర్రా భాస్కర్‌గౌడ్, గోదా వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డమీది యగ్నేశ్వర్‌గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, సభ్యులు శివకుమార్‌గౌడ్, నాగేందర్ గౌడ్, వీరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్వాన్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

గోల్కొండ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు ఆచరణీయమని కార్వాన్ బీసీ ఐక్యవేదిక అధ్యులు అనిల్‌కుమార్ అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం కార్వాన్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. గుడిమల్కాపూర్ పూలే విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగౌడ్, రఘుగౌడ్, జగన్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, బీసీ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చి పునఃప్రారంభం



చార్మినార్/బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గంలోని ఫలక్‌నుమా డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో పునర్నిర్మించిన బాప్టిస్ట్ చర్చిని రెవరెండ్ డేవిడ్‌పి గొల్లపల్లె, చర్చి సభ్యులతో కలిసి సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవరెండ్ డేవిడ్ మాట్లాడుతూ..ఈ ప్రార్థన మందిరం ఆశీర్వాదకరంగా, ఆత్మీయ మేలులు పొందే సంఘంగా ఉండాలన్నారు. సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని టీయూసీసీఏ జనరల్ సెక్రెటరీ గోనె సోలమన్ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి ఫలక్‌నుమా చైర్మన్ ఎస్. దుర్గయ్య, అడ్వైజర్ ఎస్.ప్రకాష్, ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీసిన మట్టినే తీస్తూ... కుప్పలుగా పోస్తూ..

నాంపల్లి: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి వీధుల్లోని మట్టి, చెత్తాచెదారం వరద నీటితో కలిసి మ్యాన్‌హోళ్ల లోనికి చేరుతోంది. ఇలా చేరిన మట్టిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది, హైడ్రా సిబ్బంది పూడికను తరచూ తొలగిస్తున్నారు. తొలగించిన మట్టిని మ్యాన్‌హోల్ దగ్గరే కుప్పలుగా పోస్తున్నారు. ఈ మట్టి వర్షానికి తిరిగి మ్యాన్‌హోల్‌కు చేరుతోంది. మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తరలిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్య నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి, రెడ్‌హిల్స్, చింతలబస్తీ, మాసబ్‌ట్యాంక్, శాంతినగర్, మాన్గార్‌బస్తీ, అఫ్జల్‌సాగర్, బోయిగూడ కమాన్, నాంపల్లి రైల్వే స్టేషన్, పబ్లిక్ గార్డెన్స్ రోడ్డు, ఏక్‌మినార్ చౌరస్తా, దారుస్సలాం తదితర ప్రాంతాల్లో నెలకొందని, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



బైరక్ వద్ద మ్యాన్‌హోల్ వద్దనే కుప్పలుగా దర్శనమిస్తున్న పూడిక మట్టి